క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



గోపాలపురంలో శివాజీ విగ్రహావిష్కరణ

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి పంచాయతీ గోపాలపురంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ బంధువులు, దేశభక్తులు, సైనికులు, మాజీ సైనికులు, ఆర్ఎస్ఎస్ బాధ్యులు, గోపాలపురం, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



బీరువా అందజేసిన కృష్ణమూర్తి

సంతబొమ్మాళి: మండలంలోని ఉమిలాడ గ్రామానికి చెందిన మూగు కృష్ణమూర్తి (విశ్రాంత ఆర్మీ ఉద్యోగి) ఆదివారం పాఠశాలకు బీరువా వితరణగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి సాయం



సాయం అందిస్తున్న స్పందన ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురంరూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామానికి చెందిన పతాన రోహిణ్‌కుమార్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈయన దీన స్థితిపై 'మా నాన్నను బతికించండి' శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆదివారం తేలుకుంచి గ్రామానికి చెందిన స్పందన ఫౌండేషన్ సభ్యులు బాధితుడికి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.

విద్యాజ్యోతికి శ్రీకారం



చిన్నారులతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ బాసుబంజిరి గ్రామంలో సోంపేటకు చెందిన మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యాజ్యోతి కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో కనీస చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారాలు నేర్పించడానికి ప్రత్యేక ట్యూటర్‌ను నియమించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తలితిరి తరినయ్య, తెలుకుల కృష్ణారావు, టీ టైం శంకర్, పసుపురెడ్డి రాము, శ్రీనివాస్‌రెడ్డి, టీవీకే నాగరాజు, పి.చంద్రశేఖర రావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుధాకర్

ఇచ్ఛాపురం రూరల్: హెచ్‌ఐవీ ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపవద్దని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం జిల్లా జోనల్ సూపర్‌వైజర్ సుధాకర్ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం పూర్ణాటకం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ గున్న రవి, ఎంఎల్‌హెచ్‌పీ కుమారీ, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

20న వ్యాసరచన పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న అక్కుపల్లిలో నియోజకవర్గ హైస్కూల్ స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ప్రతినిధులు గొరకల లోకేశ్వరరావు, రాపాక ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రాచీన జానపద కళారూపాలు, మానవుని జీవితంపై వాటి ప్రభావం' అనే అంశంపై పోటీలు జరుగుతాయని కోరారు. విజేతలకు ఈ నెల 22న పలాస మండలం మాకన్నపల్లిలో నిర్వహించనున్న ప్రపంచ జానపద దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని, వివరాలకు 9963708029, 9502963442 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పేరుకే ఫైర్..
అంతా రిపేర్!



మూలకు చేరిన అగ్నిమాపక వాహనం

- మూలకు చేరిన అగ్నిమాపక వాహనం
- అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణం
- వేధిస్తున్న మౌలిక వసతుల లేమి



మౌలిక వసతులు లేని ఇచ్ఛాపురం అగ్నిమాపకాధికారి కార్యాలయం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీలతో పాటు కవిటి మండలం, ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఏ క్షణంలో అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే సకాలంలో వెళ్లాల్సిన అగ్నిమాపక వాహనం మూలకు చేరింది. సిబ్బంది ఉండేందుకు నిర్మించిన భవనం సమస్యలతో సతమతమవుతోంది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని అమీన్‌సాహెబ్‌పేటలో గతంలో ఉండే అగ్నిమాపక కేంద్ర భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో 2018లో సుమారు రూ.70లక్షల అంచనాతో అదే ప్రాంతంలో తూర్పుగోదావరి ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ నూతన భవనం నిర్మాణ పనులు చేపట్టారు. 60 శాతం పనులు పూర్తి చేసినా బిల్లులు సక్రమంగా అందడం లేదంటూ ద్వారాలు, కిటికీలు, గచ్చులు, మరుగు దొడ్లు నిర్మించకుండా అర్ధంతరంగా వదిలేశారు. దీంతో కార్యాలయ కంప్యూటర్లు, ఇతర రికార్డులు సంరక్షించుకునేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. 2022లో బదిలీపై అగ్నిమాపక కేంద్రానికి ఎస్‌ఐగా వచ్చిన సూర్యారావు స్థానికుల సహకారంతో కిటికీలకు ఇనుప జాలీలు, ద్వారాలకు తలుపులు, గచ్చులు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్‌లు వేయడంతో కొంత సమస్య తీరింది. 2002 మోడల్‌కు చెందిన అగ్నిమాపక వాహనం ఎనిమిది నెలల క్రితం మూలకు చేరింది. దీంతో నరసన్నపేటకు చెందిన అదనపు వాహనాన్ని తాత్కాలికంగా తెచ్చి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కార్యాలయానికి మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అరకొర సిబ్బందితో విధులు..

కేంద్రానికి సిబ్బంది కొరత వేధిస్తోంది. అగ్నిమాపకాధికారితో పాటు ముగ్గురు లీడింగ్ ఫైర్‌మన్(ఎల్ఎఫ్)లు విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లకు గాను ఇద్దరు ఉండగా, తొమ్మిది మంది ఫైర్‌మెన్లకు గాను ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు హోమ్ గార్డులు ఉన్నారు.

రూ.30 లక్షలతో అంచనా..



సగం నిర్మాణంలో నిలిచిపోయిన అగ్నిమాపక కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లా అధికారులు రూ.30లక్షలు అంచనా వేశారు. ప్రహరీ నిర్మించేందుకు కూడా ప్రతిపాదనలు చేశారు. త్వరలో అన్ని సౌకర్యాలు సమకూరుతాయి.

– ఆర్.సూర్యారావు, ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి, ఇచ్ఛాపురం.

సామాజిక సేవలు అభినందనీయం



సన్మాన గ్రహీతలతో నిర్వాహకులు

సోంపేట: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో 'వి ఫర్ యు ఫౌండేషన్' సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సోంపేటలో సంస్థ 16వ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు వూనా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళం లాసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఈ.భరద్వాజ్, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్‌మోహన్‌లు మాట్లాడుతూ సమాజం కోసం అన్ని సామాజిక సంస్థలు కలిసి పని చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని చెప్పారు. అనంతరం గరుడాచలం అప్పలస్వామి, కె.అప్పలనాయుడు, ముప్పన దండాసి, రోణంకి అనంతరావు, శాసనపురి నాని, ప్రశాంత్, మాధురి, ధనలక్ష్మి, గణేష్, సతీష్, పిల్లి మానసలకు అవార్డులతో సత్కరించారు. టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు గుంట లచ్చయ్య, ప్రధాన కార్యదర్శి ధర్మరాజు, లక్ష్మీనారాయణ పాత్రో, జోగారావు, బల్ల బాబురావు, రాజేష్, అనిల్, కేశవరావు, కృష్ణారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్లోక పఠన పోటీలు



పోటీలకు హాజరైన విద్యార్థులు

టెక్కలి: విశ్వ హిందూ పరిషత్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకృష్ణ జయంతి పురస్కరించుకుని ఆదివారం టెక్కలిలోని సాయికృష్ణా యోగా మందిరంలో విద్యార్థులకు శ్లోక పఠన పోటీలు, కృష్ణాష్టకం, ప్రార్థన శ్లోక పఠన పోటీలు నిర్వహించారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టి.కామేశ్వర్‌రెడ్డి, బి.అన్నపూర్ణ, డి.వీరాస్వామి, పి.నాగేశ్వరరావు, ఎం.తాతయ్య, డి.ఎ.స్టాలిన్, ఎ.ప్రకాశరావు, ఆర్.విజయకుమార్, బి.అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గమిదే

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్ర స్థాయిలో ఏర్పాటు చేసిన మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని కళాకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఈదుపురంలో నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా గొనప లక్ష్మణమూర్తి, అధ్యక్షుడిగా రంగాల జానికిరామ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జీరు మోహనరావు, నర్తు గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా తిప్పన ధనుంజయ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా చలపరాయి వినోద్‌కుమార్, ఉప కార్యదర్శిగా కారంగి తులసయ్య, కోశాధికారిగా కొప్పల హేమంత్, ఉప కోశాధికారిగా కారంగి త్రినాథ్‌రెడ్డి, సలహాదారులుగా కాతిల నరసింహమూర్తిరెడ్డి, పొందల కృష్ణారావు, బాగ జయపతి, తిప్పన దాలయ్యరెడ్డి, బొర్ర హరికుమార్, న్యాయ సలహాదారులుగా ఎన్ని దేవరాజు, బత్తుల నీలకంఠం, మీడియా సలహాదారులుగా మద్దిలి కేశవరావు, కరగాన లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు.

ఇచ్ఛాపురంలో భారీ వర్షం

ఇచ్ఛాపురం: పట్టణంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం అయ్యేసరిగా ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి వాతావరణం చల్లబడింది. కాసేపటికే ఎడతెరపి లేకుండా సుమారు గంటపాటు వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మరోవైపు వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలు, వీధులు జలమయమయ్యాయి. రైతులు మాత్రం ఈ వర్షాలతో ఆనందం వ్యక్తం చేశారు.

వరదనీటితో తప్పని ఇక్కట్లు



కేటీ రోడ్డులో నిలిచిన నీరు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వరదనీరు వచ్చి చేరుతోంది. ఇటీవల చేపట్టిన రోడ్డు పనుల్లో కొన్ని చోట్ల లోతుగా ఉండటంతో అక్కడ వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. దీంతో దుకాణదారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగ పంచాయతీ యలమంచిపుట్టుగలో ఆదివారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక హోమాలు, సామూహిక కుంకుమార్చనలు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీఎంతిలక్, పిన్నింటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి సీఐగా విజయ్‌కుమార్



టెక్కలి రూరల్: టెక్కలి పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా ఎ.విజయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నక్కపల్లిలో విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇదివరకు టెక్కలిలో పనిచేసిన సీఐ పి.షైడయ్య, రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి వీఆర్‌కు వెళ్లారు.

మందసలో వీహెచ్‌పీ ర్యాలీ

కాశీబుగ్గ: భారత పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని కోరుతూ ఆదివారం మందసలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జగదీష్ పండా, గణేష్, పూనా జయకృష్ణ, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పొందర దుద్దిష్టి పాత్రో, రట్టి లక్ష్మణరావు, చంద్రమౌళి, కిషోర్, పూర్ణచంద్ర మహరణ, వూనా రవిరాజ్, యోగా బంధం సభ్యులు ఇప్పిలి కేశవరావు, వడ్డి అప్పారావు, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, దేవరశెట్టి కామేశ్వరరావు, వడ్డి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ మాజీ డైరెక్టర్‌కు సత్కారం



సత్కారం పొందుతున్న జుత్తు నీలకంఠం

కాశీబుగ్గ: మందస మండలం బిడిమి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠంకు ఆదివారం హరిపురంలో సంఘ సభ్యులు సత్కరించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘంలో నీలకంఠకు అవకాశం కల్పించిన నేపథ్యంలో పూలమాల వేసి సన్మానించారు.

అధ్వానంగా అప్రోచ్ రోడ్డు



గోతులమయమైన రోడ్డు

కంచిలి: మండల కేంద్రం కంచిలి వచ్చేందుకు జాతీయ రహదారిలో నిర్మించిన ఓవర్ బ్రిడ్జి పక్కన అప్రోచ్ రోడ్డు దారుణంగా తయారైంది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో గోతులమయంగా మారింది. దీంతో ఇచ్ఛాపురం, పలాస, కంచిలి దారిలో రాకపోకలు సాగించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి గోతులు పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి : పేదల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేద్దామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఆదివారం కొత్తపుట్టుగలోని తన నివాసంలో కవిటి మండల వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయాలు, వ్యక్తిగత ద్వేషాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం రాజకీయ కక్షతో పెన్షన్ల ఏరివేతకు సిద్ధం కావడం సరికాదన్నారు. పథకాల లబ్ధిదారుల్లో వాస్తవంగా అనర్హులు ఉంటే ఏ పార్టీవారైనా తొలగించాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం వచ్చిందని నర్తు నరేంద్రయాదవ్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, పీఎం తిలక్, బెందాళం జయప్రకాష్, పూడి నీలాచలం, పులకల శ్రీరాములు, ఇప్పిలి కృష్ణారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూసారాన్ని పరిరక్షించుకోవాలి



జీవామృతం వాడకాన్ని వివరిస్తున్న ఏఓ భార్గవి

ఇచ్ఛాపురం రూరల్: జీవన ద్రవ్యంతో కూడిన భూసారాన్ని పరిరక్షించుకోవడం ప్రతి రైతు కర్తవ్యమని మండల వ్యవసాయాధికారి భార్గవి అన్నారు. ఆదివారం మశాఖపురంలో ద్రవ్య జీవామృతం, నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవామృతం సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువులకు గొప్ప ప్రత్యామ్నాయమని చెప్పారు. వీటి వాడకం వల్ల భూమిలో వానపాములు చైతన్యవంతమై అన్ని రకాల పోషకాలను పంటలకు అందించేందుకు నిరంతరం శ్రమిస్తాయని తెలిపారు. ఈ దశలో భూమిని తిరిగి సారవంతం చేయడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి ఎం.చిట్టిబాబు, ఐసీఆర్పీలు కె.కుమారీ, కె.రూప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. తమతో కలిసి చదువుకున్న తెంబూరు కుశరాజు మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆదివారం రూ.50,000 సాయం అందించారు. ఈ మొత్తాన్ని కుశరాజు భార్య గీత, కుమార్తె సరస్వతి పేరిట పోస్టాఫీసులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కామేష్, బి.శంకరం, ఎం.జగన్, జి.బాలకృష్ణ, డి.చిన్నయ్య, ఏ.ఉమాపతి, ఎస్.రవి, పి.వెంకటరావు, టి.నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కాశీబుగ్గ: ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసి మెలిసి ఎస్సీ వర్గీకరణ జరగడానికి సహకరించాలని ఎస్సీ, ఎస్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కోరారు. కాశీబుగ్గ ఎస్సీ వీధిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరారు. అంతవరకు ఉద్యోగాల భర్తీ నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉర్జాన అప్పలరాజు, మీల జోగారావు, లండ చంద్రయ్య, చెరుకుపల్లి నేతాజీ, సుగుణాకర్, బోసి రామారావు, సింహాచలం, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు



మార్కెట్‌లో రాఖీలు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కా తమ్ముళ్ళు,అన్నా చెల్లెళ్ల మధ్య ఆత్మీయ బంధానికి ప్రతీకగా శ్రావణ మాసంలో పౌర్ణమి నాడు జరుపుకొనే వేడుక రక్షా బంధన్. స్థానికంగా ఉన్న వారితో పాటు సుదూర ప్రాంతాలలో ఉన్న సోదరులకు రాఖీ కట్టేందుకు అక్కా చెల్లెళ్లు ఎంతో ఉత్సాహం చూపుతారు. ఈ నేపథ్యంలో రాఖీల అమ్మకాలు జోరుగా సాగాయి. సోమవారం జరిగే పండగ కోసం మార్కెట్‌లో విభిన్న రాఖీలు అకట్టుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో సైతం విక్రయాలు బాగానే జరిగాయి. ముఖ్యంగా స్పెషల్ లైట్స్, స్ప్రింగ్ రాఖీ, డీజీ టెడ్డీ రాఖీ,డోరామెన్, చోటాబీమ్, మోటూపత్లూ, జెరా రాఖీ,స్టోన్ రాఖీ, వెల్వేట్ రాఖీ, ముత్యాలు, నూలు,గంధం చెక్క, వెండితో రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వజ్రపుకొత్తూరు, పూండి మార్కెట్‌లో ఒక్కో రాఖీ రూ.5 నుంచి రూ.1000 చొప్పున విక్రయాలు జరిగాయి.